సాక్షి ప్రకాశం

గురువారం । 16 । మార్చి । 2023



ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు ఇలా..

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ గురువారం చిత్తూరు జిల్లాలో ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు విధానంపై కథనం.

- 8లో..



తాగునీటి సమస్య తలెత్తకూడదు

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 33 /22

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు వెలుగొండకు 10 బస్సుల ఏర్పాటు

మార్కాపురం టౌన్: వెలుగొండ వెంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా భక్తులు వెళ్లేందుకు మార్కాపురం డిపో నుంచి 10 బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ కామేశ్వరి తెలిపారు. ప్రయాణికులు, భక్తులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అవసరమైతే అదనపు బస్సులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి

– కలెక్టర్ దినేష్ కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహణ ఉండాలని ఆర్‌టీఈ చట్టం మేరకు పాఠశాలలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. స్పందన భవనంలో బుధవారం డీఈఓ ఆధ్వర్యంలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రైవేటు పాఠశాలలో ఆర్‌టీఈ చట్టం ప్రకారం ఈడబ్ల్యూఎస్ వర్తించే విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తారని స్కూలు ముందు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనివేళల్లో మాత్రమే తరగతులు నిర్వహించాలని, అదనపు తరగతులు నిర్వహించకుడదన్నారు. మార్చి 18 నుంచి ప్రతి పాఠశాలను సంబంధిత డీవైఈఓ, ఎంఈఓలు తప్పనిసరిగా సందర్శించి నిబంధనలను పరిశీలించాలన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా ప్రతి ప్రైవేటు పాఠశాలలో ప్రతి విద్యార్థికి మాత్రలు వేయించాలన్నారు. దీనిలో విద్యాశాఖ అధికారులు, కరస్పాండెట్‌లు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మేలుకొలుపు పుస్తకం విడుదల చేస్తున్న పౌర సరఫరాల శాఖ అధికారులు

ఒంగోలు అర్బన్: ప్రజలు వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకుని ఏదైనా మార్కెట్‌లో కొనుగోలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నష్టపోకుండా ఉంటారని జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్ అన్నారు. స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దీనికి జిల్లా పౌరసరఫరాల అధికారి అధ్యక్షునిగా వ్యవహరించారు. కాలుష్య నియంత్రణ మండలి, ఆహార భద్రత, పెట్రోలియం కార్పొరేషన్, తూనికలు కొలతలు శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజలు ఏ వస్తువు కొనుగోలు చేసినా బిల్లు, వారంటీ వంటివి తప్పనిసరిగా పొందాలన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు ఫోరం సభ్యులు షేక్ సమీనా, వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ఉడుత రవికుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల వ్యవహారాల శాఖ రూపొందించిన మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పోస్టల్ బ్యాలెట్‌లు చిత్తూరు తరలింపు

ఒంగోలు అర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను బుధవారం బందోబస్తుతో చిత్తూరు తరలించారు. నోడల్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో డీఆర్‌ఓ చాంబర్‌లో పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌ను పరిశీలించి బ్యాలెట్‌లను లెక్కించి బాక్సుకు సీల్ వేశారు. అనంతరం చిత్తూరు ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించారు. దీనిలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటు హాస్పిటల్స్ చట్ట పరిధిలో నమోదు చేసుకోవాలి

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని వైద్యశాలలు, నర్సింగ్‌హోమ్‌లు, పాలీక్లినిక్‌లు, డెంటల్ క్లినిక్‌లు, లేబొరేటరీలు, ఫిజియోథెరపి క్లినిక్‌లు తప్పనిసరిగా రాష్ట్ర వైద్య, క్లినిక్‌ల ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట పరిధిలో నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీతో గడువు ముగుస్తుందని, తప్పసరిగా ఏపీజీటీవీ.ఇన్‌లో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. గడువు అనంతరం అనుమతి లేని వాటిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెద్దల సభ విజేత ఎవరో..?

పెద్దల సభలో అడుగు పెట్టేదెవరో తెలిపోయే సమయం ఆసన్నమైంది. మండలి ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13వ తేదీన పోలింగ్ నిర్వహించగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. తూర్పురాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల స్థానానికి మొత్తం 30 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఇది ఒక రికార్డయితే, అదే స్థాయిలో ఓటర్లు సైతం ఓటింగ్‌లో పాల్గొనడం మరో రికార్డు. కౌంటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుల్స్

- నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- చిత్తూరు సమీపంలోని ఆర్‌వీఎస్ కళాశాలలో కౌంటింగ్
- ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం
- మూడు షిఫ్టుల్లో కౌంటింగ్
- ఓట్ల లెక్కింపునకు 916 మంది నియామకం
- ఎమ్మెల్సీ బరిలో 30 మంది

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం గురువారం తేలనుంది. మండలి ఎన్నికల పోలింగ్ ఈ నెల 13వ తేదీన ప్రశాంతంగా నిర్వహించారు. ఓట్ల లెక్కింపును గురువారం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపును చిత్తూరు జిల్లా పూతలపట్టులోని ఎస్‌వీ.సెట్-ఆర్‌వీఎస్ లా కాలేజీలో చేపట్టనున్నారు. అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు పూతలపట్టులోని ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రకాశం జిల్లాలో మొత్తం 138 పోలింగ్ కేంద్రాలను 51 ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించారు. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లలోని 138 పోలింగ్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది బాలెట్ బాక్సులను 13వ తేదీ రాత్రికే పూతలపట్టుకు చేర్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మొత్తం 30 మంది..

తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మొత్తం 30 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వారిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 22 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 8 మంది రంగంలో నిలిచారు. వీరిలో ప్రధానంగా అధికార వైఎస్సార్‌సీపీ తరఫున పట్టభద్రుల ఎన్నికల బరిలో పేర్నాటి శ్యాం ప్రసాద రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. అధికార వైఎస్సార్‌సీపీకి చెందిన ఇరువురు అభ్యర్థులు తమ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తుండగా వీరికి ప్రధాన ప్రత్యర్థులుగా టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థులు కూడా విజయంపై ఆశలు పెట్టుకున్నారు.

మూడు షిఫ్టుల్లో కౌంటింగ్

చిత్తూరు: జిల్లా కేంద్రానికి సమీపంలోని ఆర్‌వీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. బుధవారం చిత్తూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌వో రాజశేఖర్ కౌంటింగ్ విధానంపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. పట్టభద్రుల, టీచర్ కౌంటింగ్‌కు విడివిడిగా ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల కౌంటింగ్‌కు ఒకే హాల్‌లో 40, టీచర్ కౌంటింగ్‌కు ఒకే హాల్‌లో 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కౌంటింగ్ సుదీర్ఘంగా సాగే అవకాశం ఉన్నందువల్ల మూడు షిఫ్టుల్లో సిబ్బంది పనిచేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అదనపు సిబ్బందిని సైతం నియమించారు. గురువారం సాయంత్రం వరకు బండిల్స్ కట్టే ప్రక్రియ ముగిసే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. 193 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తం 916 మంది పాల్గొననున్నారు. ఉదయం 8 గంటలకు సీసీ కెమెరాల నిఘాలో బ్యాలెట్ బాక్సులను తెరుస్తారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ పేపర్లు ఓపెన్ చేసి, పోలైన ఓట్లను 25 చొప్పున బండిల్స్ కడతారు. గురువారం సాయంత్రం మొదటి ప్రాధాన్యత ఓట్లు లెక్కిస్తారని, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి 24 గంటల నుంచి 36 గంటలు పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో అభ్యర్థి ఎవ్వరూ గెలవకపోతే, ఎలిమినేషన్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగిస్తారు. సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.





సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్, పాల్గొన్న కౌంటింగ్ సిబ్బంది

కట్టుదిట్టంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణ

పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌ను కట్టుదిట్టంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. గురువారం ఉదయం 7 గంటలకు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూంలను తెరుస్తాం. బ్యాలెట్ బాక్సులను సంబంధిత టేబుల్స్ వద్దకు చేర్చుతారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. కౌంటింగ్ సిబ్బంది అందరికీ ఎన్నికల నిబంధనల ప్రకారం శిక్షణ కూడా ఇచ్చాం.

– హరి నారాయణన్, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్, చిత్తూరు.

జిల్లా వ్యాప్తంగా పోలైన ఓట్లు ఇలా

పట్టభద్రుల స్థానానికి:		
మొత్తం ఓట్లు	:	82,225
పురుషులు	:	55,703
స్త్రీలు	:	26,517
ఇతరులు	:	5
పోలైన ఓట్లు:		
మొత్తం	:	59,835
పురుషులు	:	41,175
స్త్రీలు	:	18,660
శాతం	:	72.76
ఉపాధ్యాయ స్థానానికి		
మొత్తం ఓట్లు	:	5,789
పురుషులు	:	3,691
స్త్రీలు	:	2,098
పోలైన ఓట్లు		
మొత్తం ఓట్లు	:	5,322
పురుషులు	:	3,428
మహిళలు	:	1894
పోలైన శాతం	:	91.93

తొలిరోజు ప్రశాంతం



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు



రూం నెంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు

- ప్రారంభమైన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు
- పరీక్షల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, రాష్ట్ర పరిశీలకులు
- 1906 మంది విద్యార్థులు గైర్హాజరు

ఒంగోలు: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తొలిరోజు పరీక్షలు బుధవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ట్రాఫిక్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా నగరంలో పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉదయం 8 గంటల నుంచే భారీగా పోలీసు సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో నిమగ్నమయ్యారు. కలెక్టర్, ఎస్పీ, ఇంటర్మీడియెట్ రాష్ట్ర పరిశీలకులు, జిల్లా ఆర్‌ఐవోలు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ప్రార్థనా మందిరాలకు ఉదయాన్నే చేరుకుని ప్రార్థనలు చేశారు.

ఉదయం 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి:

ఇంటర్ పరీక్షలు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ప్రారంభమయ్యాయి. దీని ప్రకారం మొత్తం 95 పరీక్ష కేంద్రాలున్నాయి. ప్రస్తుత ప్రకాశం జిల్లా పరిధిలో 72 కేంద్రాలు ఉన్నాయి. మిగిలిన 23 పరీక్ష కేంద్రాలు బాపట్ల జిల్లాతోపాటు నెల్లూరు జిల్లా పరిధిలోని కందుకూరు ప్రాంతంలో ఉన్నాయి. ఇంటర్‌బోర్డు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ప్రత్యేక పరిశీలకుడిగా రమణారెడ్డిని నియమించారు. ఆయన బుధవారం ఇంకొల్లు, చీరాల, పర్చూరు ప్రాంతంలోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నగరంలోని నారాయణ జూనియర్ కాలేజీతోపాటు మరో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అధికారులకు పలు సూచనలు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరి వద్ద మొబైల్ ఫోన్ ఉండడానికి వీల్లేదన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని 72 పరీక్ష కేంద్రాల్లో నాలుగు మాత్రమే సమస్యాత్మక కేంద్రాలుగా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతున్నాయని, జెరాక్స్ సెంటర్లు సైతం మూసివేయించేందుకు ఎస్పీకి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎస్పీ మలికాగర్గ్ కూడా నగరంలోని నాగార్జున డిగ్రీ కాలేజీ, కోర్టు సెంటర్‌లోని నారాయణ జూనియర్ కాలేజీ, శ్రీచైతన్య జూనియర్ కాలేజీ సెంటర్లను తనిఖీ చేశారు. కోర్టుసెంటర్‌లోని నారాయణ జూనియర్ కాలేజీ వద్ద ఒక కానిస్టేబుల్ చేతిలో మొబైల్ ఉండడాన్ని గమనించి ఎస్పీ ఆగ్రహించారు. వెంటనే మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విధులకు హాజరయ్యే సిబ్బంది ఎవరి వద్ద మొబైల్ ఫోన్ ఉండడానికి వీల్లేదన్నారు. విద్యార్థులను కూడా పూర్తిగా తనిఖీ చేసిన తరువాతనే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించినట్లు అధికారులు ఎస్పీకి వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున సమీపంలో ఎవరూ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జెరాక్స్ సెంటర్లు కూడా మూసివేయించాలన్నారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు జరిగే సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం తిరుగుతూ ఉంటాయని, ప్రశ్నపత్రాల తరలింపు, సమాధాన పత్రాల డిపాజిట్ చేసేందుకు తగిన ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనిపిస్తే డయల్ 100 లేదా డయల్ 112కు సమాధానం ఇవ్వాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్



పరీక్ష కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

తొలి రోజు పరీక్షకు 1906 మంది గైర్హాజరు:

తొలిరోజు పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 1906 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల ప్రాంతీయ మండలి పర్యవేక్షకుడు ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. 25,829 మంది జనరల్ విద్యార్థులకుగాను 24,466 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగానికి సంబంధించి 3,584 మందికిగాను 3041 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 1363 మంది, ఒకేషనల్ విభాగంలో 543 మంది వెరసి 1906 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ రెండు సెంటర్లు, జిల్లా ఎస్పీ 3 కేంద్రాలు, రాష్ట్ర పరిశీలకులు 3, ఆర్‌ఐవో 6, డీఈసీ సభ్యులు, డీవీఈవో, హైపవర్ కమిటీ సభ్యులు 13 కేంద్రాలను తనిఖీ చేశారు. తొలిరోజు పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఆర్‌ఐవో తెలిపారు.

నేడు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు:

ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం పరీక్షలు ప్రారంభమవుతాయి. ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో మాత్రమే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తామని, అనంతరం ఒక్క నిముషం లేటైనా పరీక్షకు అనుమతి ఉండదని ఆర్‌ఐవో తెలిపారు. 27487 మంది జనరల్, 3469 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

అమరజీవికి వందనం

- ఆంధ్రరాష్ట్ర అవతరణకు కారకుడు
- నేడు ఆయన జయంతి
- శ్రీరాములు స్వస్థలం పీసీపల్లి మండలం పడమటిపల్లి



పడమటిపల్లిలోని పొట్టిశ్రీరాములు విగ్రహం

పీసీపల్లి: ఆనాడు తెలుగు వారు పరభాషా పాలనలో తీవ్ర అవమానాలు ఎదుర్కొంటున్నారు. ఏ పనికావాలన్నా నాటి రాజధాని మద్రాసు వెళ్లి రావడం వ్యయప్రయాసలతో కూడుకోవడంతో అల్లాడిపోతున్నారు. ఢిల్లీ స్థాయిలో నేతలు కూడా తెలుగు వారి కష్టాలు పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో తెలుగు తేజం దేశ రాజధాని పీఠాన్ని కదిలించింది. పొట్టి శ్రీరాములు పేరు మార్మోగింది. ఆయన ఆత్మ బలిదానంతో ఆంధ్ర రాష్ట్ర అవతరణ సిద్ధించింది. ఆ మహానుభావుడు పీసీపల్లి మండలంలోనే జన్మించడం ఈ గడ్డ అదృష్టం. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటులో ఆయన వేసిన బాట ఎందరికో స్ఫూర్తినిచ్చింది.

ఇక్కడే పుట్టి అంత ఎత్తుకు ఎదిగి

పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న పీసీపల్లి మండలం పడమటిపల్లిలో జన్మించారు. ఇరవై ఏళ్ల వరకు శ్రీరాములు విద్యాభ్యాసం మద్రాసులోనే జరిగింది. తరువాత బొంబాయిలో శానిటరీ ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసి గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో చేరారు. అక్కడ దాదాపు నాలుగేళ్లపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నేపథ్యంలో గాంధీజీ బాటలో నడిచి 1930 లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. దీంతో జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. 1941-42 లో క్విట్ ఇండియా వంటి అనేక ఉద్యమాల్లో పాలు పంచుకున్నారు. చివరకు ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు విడిచారు. వైశ్య కుటుంబంలో జన్మించిన ఆయన జిల్లాకు ఎనలేని కీర్తి సంపాదించి పెట్టారు. అయితే కొన్ని దశాబ్దాల క్రితం ఈ ప్రాంతం నెల్లూరు జిల్లాలో ఉండడంతో ఆ జిల్లాకు చెందిన వారిగా రికార్డులకెక్కింది. చిన్నతనంలో ఈ ప్రాంతంలో ఆయన వదిలిన గుర్తులు పదిలంగా ఉన్నాయి.

పొట్టిశ్రీరాములుకు నిజమైన నివాళి వైఎస్‌తోనే

తెలుగు వారి కోసం ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కోసం కృషి చేసి ప్రాణాలర్పించి పొట్టిశ్రీరాములుకు సరైన నివాళి అర్పించింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన హయాంలోనే ఆయన పుట్టిన అప్పటి జిల్లా అయిన నెల్లూరు జిల్లాకు శ్రీపొట్టి శ్రీరాములు జిల్లాగా నామకరణం చేసి తెలుగు ప్రజల తరఫున శాశ్వతంగా ఆయనకు గౌరవం తెచ్చిపెట్టారు.

స్మృతి వనానికి చురుగ్గా ఏర్పాట్లు

అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగానికి గుర్తుగా ఆయన కుటుంబ బంధువు, ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు త్రిపురనేని రామస్వామి మనవడు త్రిపురనేని సాయిచంద్ చెన్నైలో స్మారక మందిరం ఏర్పాటు చేసి చెన్నై నుంచి పడమటిపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆయన జన్మించిన గృహం పాడుపడిపోవడంతో ఆ స్థానంలో నూతన గృహం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పడమట్టిపల్లిలో శ్రీరాములు గృహాన్ని పడేసి నూతన గృహం నిర్మాణానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. నేడు శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని వైద్యశిబిరం, జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



పడమటిపల్లిలో స్మృతి వనం నిర్మిస్తున్న ప్రదేశం

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

- పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల
- ఉత్సాహంగా తిలకించిన ప్రజలు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వెలుగొండ క్షేత్రంలో రాష్ట్ర స్థాయి ఎడ్లబల ప్రదర్శన పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉడుముల మాట్లాడుతూ ఇది రైతు రాజ్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నీ విధాలా రైతులను ఆదుకొనేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పశు ప్రదర్శన పోటీలు రైతులకు ఎంతగానో ఉత్సాహం నింపుతాయన్నారు. ముందుగా ఆలయ కమిటీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఎడ్ల పోటీల ప్రారంభానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులకు, మాజీ ఎమ్మెల్యేకు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు.

ఉత్సాహంగా రెండు పళ్ల సైజు ఎడ్ల పోటీలు:

ఉదయం రెండు, సాయంత్రం ఆరు పాలపండ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తిరుపతిరెడ్డి, మేకలవారిపల్లి రెడ్ల సంఘం ఆధ్వర్యంలో పోటాపోటీగా జరిగిన ఎడ్ల పోటీలను తిలకించటానికి రైతులు భారీ సంఖ్యలో వెలుగొండకు తరలివచ్చారు. రెండు, ఆరు పాలపళ్ల సైజు ఎడ్ల పోటీల్లో ప్రకాశం, గుంటూరు, కృష్ణా, కర్నూలు జిల్లాల నుంచి మొత్తం 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఎడ్ల పందేలకు వ్యాఖ్యాతలుగా, రిఫరీలుగా వెంటరామిరెడ్డి, ఎల్‌ఐసీ వెంకటరెడ్డి, బ్రహ్మరెడ్డి వ్యవహరించారు. ఎడ్లపందేలను తిలకించటానికి వచ్చిన ప్రజలకు తిరునాళ్లలో అన్నదాన సత్రాల్లో భోజన వసతి సమకూర్చారు.

సత్తా చాటిన ఒంగోలు గిత్తలు..

రెండు పళ్లసైజు ఎడ్ల పోటీల్లో మొత్తం 6 జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి స్థానంలో గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్య చౌదరి, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన నక్కా బలరామకృష్ణకు చెందిన సంయుక్త ఎడ్ల జత నిర్ణీత సమయానికి 4200 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి పొందాయి. వైఎస్సార్ కడప జిల్లా దాసరపల్లికి చెందిన శీలం రమేష్, మొలకుల వీరన్నయాదవ్‌ల ఎడ్ల జత 3888 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా తిప్పాయపాలెం, ఔరంగాబాద్‌కు చెందిన సింగారెడ్డి శ్రీనివాసరెడ్డి, రామోజీల సంయుక్త ఎడ్లజత 3285 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా మామిళ్లపల్లికి చెందిన బి.శంకరయ్య ఎడ్ల జత 3241 అడుగులు లాగి నాలుగో స్థానం సాధించాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా నాలుగు బహుమతులను రూ.20, రూ.15, రూ.10, రూ.5 వేలను దాతలు అందజేశారు.

క్లుప్తంగా

వీధి కుక్కల దాడిలో జింక మృతి


కుక్కల దాడిలో మృత్యువాత పడిన జింక

పెద్దదోర్నాల: వీధి కుక్కల బారి నుంచి తప్పించుకోబోయిన జింక అంతర్గత గాయాలతో మృత్యువాత పడింది. ఈ సంఘటన మండల పరిధిలోని మోట్లమల్లికార్జునపురం వద్ద బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. నల్లమల అటవీ ప్రాంతం నుంచి వెలుపలికి వచ్చిన జింకను వీధి కుక్కలు వెంటాడాయి. వాటి బారి నుంచి తప్పించుకునే క్రమంలో మోట్ల మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోకి జింక ఎగిరి దూకింది. దీంతో అంతర్గత గాయాల కారణంగా గుడి ప్రాంగణంలోనే జింక మృతి చెందింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టారు. డీఆర్వో చెన్నయ్య ఆధ్వర్యంలో జింక మృత కళేబరాన్ని మండల కేంద్రానికి తరలించారు. సమయం దాటిపోవడంతో గురువారం పోస్టుమార్టం నిర్వహించి అటవీ ప్రాంతంలోనే దహనం చేయనున్నట్లు డీఆర్వో తెలిపారు.

మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌పై వేధింపుల ఆరోపణ

- కమిటీ వేసిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు

ఒంగోలు అర్బన్: జిల్లా కేంద్రం ఒంగోలులోని ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్, బయోకెమిస్ట్రీ విభాగం హెచ్‌ఓడీ వెంకటరమణ వేధిస్తున్నాడంటూ అదే విభాగంలో పనిచేసే మహిళా ఉద్యోగి ఆరోపించారు. ఈ నేపథ్యంలో విషయం పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. దీంతో పోలీసులు వెంకటరమణను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. దీంతోపాటు వైద్య కళాశాలలో ఇతర సిబ్బందితో మాట్లాడి వెంకటరమణతోపాటు ఆరోపణలు చేసిన మహిళా ఉద్యోగి పరిస్థితిపై ఆరా తీశారు. ఇదిలా ఉండగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు వైద్యుల బృందంతో కమిటీ ఏర్పాటు చేసి నిజానిజాలను నిగ్గు తేల్చాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా వెంకటరమణ కుటుంబ సభ్యులు, ఆరోపణలు చేస్తున్న మహిళా ఉద్యోగి రాజీ పడినట్లు సమాచారం.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

అర్థవీడు(కంభం): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు.. అర్ధవీడు మండలం యాచవరం గ్రామానికి చెందిన అన్నదమ్ములు దానమయ్య(ఆర్మీ జవాన్), బాలకాశయ్య(32) మంగళవారం బైక్‌పై వెళ్తూ మాగుటూరు వద్ద అదుపుతప్పి కిందపడిపోయారు. ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా దానమయ్యను గుంటూరుకు, బాలకాశయ్యను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బాలకాశయ్య బుధవారం మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

– కేసు నమోదు చేసిన పోలీసులు

మార్కాపురం: పెళ్లి చేసుకుంటానని రెండు సార్లు నిశ్చితార్థం చేసుకొని మోసగించిన యువకుడిపై ఫిర్యాదు చేయగా..పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని ఎస్ఎస్ నగర్‌లో నివాసం ఉండే ఒక యువతితో రాజేష్‌కు గత ఏడాది నిశ్చితార్థం జరిగింది. గత ఏడాది ఆగస్టు 11న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. అయితే ఎక్కువ కట్నం వస్తుందని ఆశతో మరో యువతితో నిశ్చితార్థం చేసుకున్నాడు. అయితే రెండో యువతితో చేసుకున్న నిశ్చితార్థం రద్దు కావడంతో మొదటి యువతి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మరోసారి ఈ ఏడాది జనవరి 25న నిశ్చితార్థం చేసుకుని ఫిబ్రవరి 22న వివాహ ముహూర్తం పెట్టుకున్నారు. పెళ్లి దుస్తుల కొనుగోలుకు రూ.50 వేలు సైతం తీసుకున్నాడు. ఆ తర్వాత నుంచి రాజేష్ కనిపించకపోవడంతో మోసపోయామని గుర్తించిన యువతి తల్లిదండ్రులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితునిపై కేసు నమోదు చేశారు.

సీఎంకు డీఎస్సీ 1998 అభ్యర్థుల కృతజ్ఞతలు

ఒంగోలు: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగ నియామకాలు ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీఓ జారీచేయడంపై డీఎస్సీ 1998 అభ్యర్థుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వీరయ్య, మండువ సుబ్బారావు, వీఎస్ విష్ణుమూర్తి, దాసరి జయరావు, కొండపి సుబ్బారావు తదితరులు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉత్తర్వులు రాష్ట్రంలో 4534 మంది కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నింపుతున్నాయన్నారు. అందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి నియామకాలు ఇవ్వాలని ఆదేశించడం పట్ల ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, ఉపాధ్యాయ ఎంఎల్‌సీ కల్పలత, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, 1998 డీఎస్సీ కమిటీ సభ్యులు కేశవరపు జాలిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

ఒంగోలు: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల నియామకాలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు కేశవరపు జాలిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 4534 మందికి కాంట్రాక్టు నియామక ఉత్తర్వులు పొందనున్నారన్నారు. సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు ఇలా


చిత్తూరు సమీపంలోని వీఆర్ఎస్ కాలేజీలో కౌంటింగ్ కేంద్రం

- ప్రాధాన్యత ఓటింగ్ విధానం
- పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కౌంటింగ్ ను పర్యవేక్షించనున్న అబ్జర్వర్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల, టీచర్‌ల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ గురువారం నిర్వహించనున్నారు. ఈ కౌంటింగ్ కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ వెల్లడించారు. అబ్జర్వర్‌లు, పోటీలోని అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. అయితే సాధారణ ఎన్నికల మాదిరిగా ఓట్ల లెక్కింపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉండదు. సాధారణ ఎన్నికల్లో ప్రత్యర్థి కన్నా ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలా ఉండదు. మొత్తం పోలైన ఓట్లలో సగానికి కంటే ఎక్కువ ఓట్లు వస్తేనే గెలిచినట్లు. ఈ శాసనస మండలి ఎన్నికలు పట్టభద్రులు, ఎమ్మెల్యేలతో పాటు సామాన్య ప్రజా నీకాన్ని సైతం ఆసక్తి కలిగిస్తున్నాయి. ఈ ఎన్నికలు మేధావుల మేధస్సుకు గీటురాయి. సాధారణ ఎన్నికల్లో ఓటరు ఒక అభ్యర్థికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం పాధాన్యతకు అనుగుణంగా అభ్యర్థిని ఎన్నుకోవచ్చు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు ఏ విధంగా వేస్తారో ఒక్కసారి పరిశీలిద్దాం.

ప్రాధాన్యత ఓటింగ్ విధానం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ ఓటు వేసే అవకాశం ఉంటుంది. కానీ, ప్రాధాన్యత క్రమంలో ఓటేయ్యాలి. దీనినే ప్రాధాన్యత ఓటింగ్ క్రమం అంటారు. అంటే ఓటరు తనకు నచ్చే అభ్యర్థుల ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయవచ్చు. తనకు బాగా నచ్చిన అభ్యర్థికి '1' ప్రాధాన్యత ఓటు వేశాక మిగిలిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో 2,3,4 ఇలా ఎంతమందికైనా ఓటు వేయవచ్చు.

ఇలా పోలైన మొత్తం ఓట్లలో సగం కన్నా ఒక్క ఓటు ఎక్కువగా వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆరుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా మొత్తం 15000 ఓట్లు పోలయ్యాయి అనుకుంటే అందులో గెలవడానికి మొదటి ప్రాధాన్యత ఓట్లు 7,501 రావాల్సి ఉంటుంది. అలా వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

ప్రాధాన్యత ఓట్లు రాకుంటే..

అభ్యర్థుల్లో ఏ ఒక్కరికీ మొదటి ప్రాధాన్యత ఓట్లు రాకుంటే ఈ కింది విధంగా లెక్కిస్తారు.
– అ అభ్యర్థికి – 4,000, ఆ అభ్యర్థికి – 5,000, ఇ అభ్యర్థికి – 3,000, ఈ అభ్యర్థికి –1,000, ఉ అభ్యర్థికి – 800, ఊ అభ్యర్థికి – 1200 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి అనుకుందాము. ఇందులో ఏ అభ్యర్థికి కూడా 50 శాతం కంటే ఎక్కువగా అనగా 7501 ఓట్లు రాలేదు. కనుక ఎవరూ గెలవలేదు. దీంతో ప్రాధాన్యత ఓటింగ్‌లో ఎలిమినేషన్ చేసి ఓట్లు లెక్కిస్తారు. అంటే ఇందులో ఉ అభ్యర్థికి అందరి కన్నా తక్కువ ఓట్లు వచ్చినందున అతడిని పోటీ నుంచి ఎలిమినేట్ చేస్తారు. అతడికి వచ్చిన 800 ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరెవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో వాటిని పంపిణీ చేస్తారు. ఈ 800 ఓట్లలో అ అభ్యర్థికి 300, ఆ అభ్యర్థికి 200, ఇ అభ్యర్థికి 100, ఈ కి 50, ఊ అభ్యర్థికి 150 రెండో ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి అనుకుందాము. అప్పుడు అ అభ్యర్థికి 4000+300=4300, ఆ అభ్యర్థికి 5000+200=5200, ఇ అభ్యర్థికి 3000+100=3100, ఈ అభ్యర్థికి 1000+50=1,050, ఊ అభ్యర్థికి 1200+150=1350 ఓట్లు వచ్చాయి. కానీ గెలవడానికి కావాల్సిన 7501 ఓట్లు ఎవరికీ రానందున అందులో పై అభ్యర్థుల్లో అందరికంటే తక్కువ ఓట్లు వచ్చిన ఈ అభ్యర్థిని పోటీనుంచి తప్పించి అతడికి వచ్చిన 1000 ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లు 50, మూడో ప్రాధాన్యత ఓట్లను మిగతా నలుగురికి పంపిణీ చేస్తారు. ఈ అభ్యర్థికి వచ్చిన మొదటి 1000 ప్రాధాన్యత ఓట్లలో అ అభ్యర్థికి 200, ఆ అభ్యర్థికి 550, ఇ అభ్యర్థికి 100, ఊ అభ్యర్థికి 150 ఓట్లు చొప్పున రెండో ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి అనుకుందాం. అలాగే ఈ అభ్యర్థికి వచ్చిన 50 రెండో ప్రాధాన్యత ఓట్లు గల బ్యాలెట్ పేపర్‌లో అ, ఆ, ఇ, ఊ అభ్యర్థులకు వచ్చిన మూడో ప్రాధాన్యత ఓట్లను కలుపగా అ కు 10 ఓట్లు, ఆ అనే అభ్యర్థికి 30, ఇకు 3, ఊ అభ్యర్థికి 7 మూడో ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. అప్పుడు అ అభ్యర్థికి 4300+200+10=4510, ఆ అభ్యర్థికి 5200+550+30=578, ఇ అభ్యర్థికి 3100+100+3=3203, ఊ అభ్యర్థికి 1350+150+7=1507 ఇప్పుడు కూడా అ, ఆ, ఇ, ఊ లలో ఎవరికి కూడా గెలుపునకు అవసరమైన 7,501 ఓట్లు ఎవరికి రాలేదు. కావున పై నలుగురు అభ్యర్థులలో అతి తక్కువ ఓట్లు వచ్చిన ఊ అభ్యర్థిని పోటీ నుంచి తొలగించి అభ్యర్థికి వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లు 1200, రెండో ప్రాధాన్యత ఓట్లు 200, మూడో ప్రాధాన్యత ఓట్లు 7 ల లో ఉన్న రెండు, మూడు, నాలుగో ప్రాధాన్యత ఓట్లు పొందిన మిగిలిన ముగ్గురు అభ్యర్థులకు పంపిణీ చేస్తారు. అలా చేయగా అ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓట్లు 200, మూడో ప్రాధాన్యత ఓట్లు 30, నాలుగో ప్రాధాన్యత ఓట్లు 1 వచ్చి మొత్తంగా 4741 ఓట్లు వచ్చాయి. ఆ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓట్లు 1000, మూడో ప్రాధాన్యత ఓట్లు 110, నాలుగో ప్రాధాన్యత ఓట్లు 5 వచ్చి మొత్తంగా 6895 ఓట్లు వచ్చాయి. ఇ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓట్లు 150, మూడో ప్రాధాన్యత ఓట్లు 10, నాలుగో ప్రాధాన్యత ఓట్లు 1ఓట్లు మొత్తం కలిపి 1668 ఓట్లు వచ్చాయి. అయినా అ, ఆ, ఇ లలో ఎవరికి కూడా గెలుపునకు అవసరమైన 7501 ఓట్లు రాలేదు. కావున పై ముగ్గురు అభ్యర్థుల్లో అతి తక్కువ ఓట్లు వచ్చిన ఇ అభ్యర్థిని పోటీ నుంచి తొలగించి అభ్యర్థికి వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లు 3000, రెండో ప్రాధాన్యత ఓట్లు 100, మూడో ప్రాధాన్యత ఓట్లు 3, నాలుగో ప్రాధాన్యత 1 ఓట్లలో ఉన్న రెండు, మూడూ, నాలుగు, ఐదో ప్రాధాన్యత ఓట్లు పొందిన మిగిలిన ఇద్దరు అభ్యర్థులకు పంపిణీ చేస్తారు. అలా చేయగా అ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓట్లు 1200, మూడో ప్రాధాన్యత ఓట్లు 30, నాలుగో ప్రాధాన్యత ఓట్లు 2, ఐదో ప్రాధాన్యత ఓట్లు 0 వచ్చాయి. అలాగే ఆ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓట్లు 1800, మూడో ప్రాధాన్యత ఓట్లు 40, నాలుగో ప్రాధాన్యత ఓట్లు 1, ఐదో ప్రాధాన్యత ఓట్లు 1 వచ్చాయి. అప్పుడు మొత్తం అ అభ్యర్థికి 4771+1200+30+2+0=6003 ,ఆ అభ్యర్థికి 6895+1800+40+1+1=8767 దీంతో ప్రాధాన్యత ఓటు క్రమంలో ఆ అభ్యర్థికి పోలైన ఓట్లల్లో 50 శాతం కంటే ఎక్కువగా అనగా 7501 ఓట్లకంటే ఎక్కువగా వచ్చాయి. కనుక ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటించి ఫలితాలు వెల్లడిస్తారు. ఒక వేళ రెండో ప్రాధాన్యతలోనూ ఏ అభ్యర్థికి కూడా 50 శాతం కంటే ఎక్కువగా రాకుంటే మూడు, నాలుగు ఆ కింది ప్రాధాన్యత ఓట్లు లెక్కించి మొత్తం ఓట్లల్లో సగానికి కంటే ఎక్కువగా ఓట్లు పోలైన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

17, 18 తేదీల్లో జిల్లాస్థాయి ఆటల పోటీలు

- పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన మేయర్ గంగాడ సుజాత


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తల్లిదండ్రులు బాలినేని వెంకటేశ్వరరెడ్డి, రమాదేవి పేర్ల మీదుగా జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహించడం శుభపరిణామమని నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణతో కలిసి బుధవారం తన ఛాంబర్‌లో పోటీలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పండుగ సమయాల్లో క్రీడాపోటీలు నిర్వహించడం అనేది తరతరాలుగా వస్తున్న మంచి సంప్రదాయమన్నారు. అటువంటి సంప్రదాయాన్ని కొనసాగించేందుకు , యువతలో స్ఫూర్తిని నింపేందుకు పోటీలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు లయన్స్‌క్లబ్ ఆఫ్ సిటిజన్స్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ మాట్లాడుతూ బాలినేని వెంకటేశ్వరరెడ్డి, రమాదేవి చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఈ నెల 17, 18 తేదీల్లో వాలీబాల్, కబడ్డీ , షటిల్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలన్నీ ఓపెన్ కేటగిరీలో పురుషులకు మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17వ తేదీ ఉదయం స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ పోటీలు ప్రారంభం అవుతాయని, 18వ తేదీ పీవీఆర్‌లో కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. షటిల్(డబుల్స్) పోటీలను 18వ తేదీ స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.7500, తృతీయస్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు అందజేస్తామన్నారు. విజేతలకు 18వ తేదీ పీవీఆర్ గ్రౌండ్‌లో బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలకు ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా సోమినేని సురేష్ వ్యవహరిస్తున్నారని, పూర్తి వివరాలకు 98494 29839 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

మార్కాపురం: భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు సీఐ భీమానాయక్ తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి మండలంలోని వేములకోటలో భార్య సునీతపై అనుమానంతో భర్త రేళ్ల శ్రీను రోకలిబండతో తలపై కొట్టడంతో మృతి చెందింది. కేసులో నిందితుడు శ్రీను వీఆర్వో వద్ద లొంగిపోవడంతో వీఆర్వో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. శ్రీనును అదుపులోనికి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

- నిర్దేశించిన పనులన్నీ చిత్తశుద్ధితో చేయాలి
- మండల స్థాయి అధికారులతో సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జేసీ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: వేసవి నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సాగర్, గుండ్లకమ్మ నీటితో తాగునీటి చెరువులు నింపేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆ నీటిని ఇతర అవసరాలకు అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్లతో మంచినీటిని సరఫరా చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. అంతకేకాకుండా మండల స్థాయి అధికారులకు నిర్దేశించిన పనులన్నీ చిత్తశుద్ధితో చేయాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ జాబ్ కార్డుల మంజూరు, హాజరు నమోదులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాల్లో సకాలంలో సమర్థంగా ప్రజలకు సేవలు అందేలా చూడాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిసనర్లు పర్యవేక్షించాలన్నారు. సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జగనన్న పాల వెల్లువ పథకంలో మరింత మంది పాడి రైతులు అమూల్ సంస్థకు పాలు పోసేలా చూడాలన్నారు. ఈ పథకం ప్రయోజనాలను పాడి రైతులకు వివరించాలని సూచించారు. గ్రామ స్థాయిలో బాల్య వివాహాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఇరిగేషన్ ఎస్ఈ లక్ష్మారెడ్డి, డీపీఓ నారాయణ రెడ్డి, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి, డీసీఓ రాజశేఖర్, పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి, పరిశ్రమల శాఖ జీఎం మధుసూధన్‌రెడ్డి, డీఈఓ రమేష్, సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి, సీపీఓ వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఒంగోలు అర్బన్: వచ్చే ఏప్రిల్ నెలలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో టెన్త్ పరీక్షల ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద ఆర్మ్‌డ్ గార్డ్సను ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు జెరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసి వేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు తాత్కాలికంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అవతవకలకు పాల్పడిన వారిపై యాక్ట్ 25 ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షలకు విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకుండా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యాశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

హనుమంతునిపాడు: మండల పరిధిలోని రెడ్డెవారిపల్లిలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. తహసీల్దార్ ఎస్ హరిబాబు, ఎస్సై క్రిష్ణపావని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం పార్వతి బాలిక ఇంటికి వెళ్లి ఆధార్ కార్డు పరిశీలించారు. 18 ఏళ్ల వయసు లేకపోవడంతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై 18 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే కష్టాలు, ఇబ్బందులను తల్లిదండ్రులకు తెలియజేశారు. బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం వివాహం చేయకుండా తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో లిఖితపూర్వకంగా లేఖ తీసుకుని సంతకాలు చేయించుకున్నారు.


ఒంగోలులో అంధ విద్యార్థిని పరీక్షా హాలుకు తీసుకెళ్తున్న ఏఎస్సై


ఒంగోలులోని ఏకేవీకే కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద ఇంటర్ విద్యార్థుల కోలాహలం

ఉత్కంఠగా.. ఉత్సాహంగా..

ఇంటర్మీడియెట్ విద్యార్థులు తొలిరోజు బుధవారం పరీక్ష కేంద్రాల వద్ద ఉత్సాహంగా, ఒకింత ఉత్కంఠగా కనిపించారు. తల్లిదండ్రుల పాదాలకు మొక్కి, ఆలయాల్లో హాల్ టికెట్లకు పూజలు చేయించి తమ ప్రతిభను పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 'ఏడాదంతా చదివాం.. పేపర్ ఎలా వస్తుందో ఏమో'.. 'దేవుడా నేను పరీక్ష బాగా రాసేలా దీవించు'.. అనుకుంటూ పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.
– సాక్షి నెట్‌వర్క్


ఒంగోలు లాయరుపేట బాబా ఆలయంలో పూజలు


కొండపిలో పరీక్ష రాసేందుకు సిద్ధంగా విద్యార్థులు


కనిగిరిలో పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు


మార్కాపురంలో పరీక్ష కేంద్రానికి చేరుకున్న విద్యార్థులు


కంభం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..